కథ

# పొట్టి గుట్టలు

బడిలో గణగణమని మోగింది లాంగ్ బెల్. 'హాలో'మని పిల్లోళ్లు బడినుంచి పరుగులు తీస్తూ బయటికి వచ్చారు.

గంగమ్మ గుడికాడ గొర్రె ఒకటి పరిగెత్తుతా వస్తా ఉంది. గొర్రె కాలుకు అడ్డంగా తన కాలు పెట్టినాడు ఆరు చదివే గోవిందుడు.

అంతే.. అది ఎగిరి దూకింది.

వెంటనే కాలు వెనక్కి తీసేశాడు.

వెనక వచ్చే గొర్రెలన్నీ అడ్డం ఏమీ లేకున్నా ఎగిరెగిరి దుమికి వెళ్లాయి. పడీపడీ నవ్వినాడు పదేళ్ల గోవిందుడు.

పక్కనే ఉన్న బడిపిల్లలందరూ 'హ్హాహ్హాహ్హా..' అని చప్పట్లు కొట్టినారు.

నేరేడు చెట్టు కింద ముసలవ్వ, ఉడకబెట్టిన వేడివేడి మొక్కజొన్న కంకులు అమ్ముతుంటే మూడు కొన్నాడు గోవిందుడు. చేత్తోనే వాటిని విరిచి సావాసగాళ్లకు తలా ఒక ముక్క ఇచ్చినాడు. వాళ్లు ముసిముసిగా నవ్వుతూ థ్యాంక్స్ మీద థ్యాంక్స్‌లు చెప్పినారు.

తనూ తింటూ బడి నుంచి ఇంటికి వెళ్లినాడు.

* * *

గోవిందుడు లక్స్ సోప్‌తో ముఖం కడుక్కుంటున్నాడు. ఇంతలో తక్కోళం మామ వచ్చి..

''ఒరేయ్ గోవిందా.. మా కోడి మీ ఇంటికి వచ్చిందా!. మీ ఇంట్లో ఏమైనా గుడ్డు పెట్టిందా?'' అని అడిగినాడు.

''లేదు మామా.. మీ కోడీ రాలేదు, గుడ్డూ పెట్టలేదు'' అని బదులిచ్చినాడు గోవిందుడు.

''మా కోడి దొంగ మరిగిపోయిందిరా! తిండేమో మా ఇంట్లో.. గుడ్డేమో ఎవరింట్లోనో పెట్టేస్తా ఉంది'' అని బాధపడతా పోయినాడు తక్కోళం మామ.

ఇంతలో.. గోవిందుడికి 'మే.. మే..' అన్న అరుపులు వినిపించినాయి.

'మన ఇంట్లో మేక ఎక్కడిదబ్బా' అని ఇల్లంతా వెదికి, ఎక్కడా కనిపించక పోయేసరికి ఇంటి వెనక్కి వెళ్లినాడు. కానుగ చెట్టు కింద ఒక నల్ల మేకపోతు కనిపించింది. అది చూరుకు వేలాడదీసిన ఆకులు తింటున్నాది.

'పొట్టితోక, పెద్దకొమ్ములు, పొడుగాటి చెవులు.. భలే ముచ్చటగా ఉందే..' అని ఆనందపడినాడు.

'ఊర్లో అందరికీ జీవాలు ఉండాయి. మన ఇంట్లోనే లేవని చాన్నాళ్లుగా గొడవ చేసినాను కదా!? అందుకని నాయన తీసుకొచ్చినట్లు ఉండాడు..' అనుకున్నాడు. దగ్గరగా వెళ్లి దాని కళ్లలోకి చూసినాడు. ఎందుకో అది.. చాన్నాళ్లుగా, బాగా తెలిసినట్లు అనిపించింది. దాని మెడమీద చేయి వేసి మెత్తమెత్తటి బొచ్చును చిన్నగా తడిమినాడు. దానికి తొట్టెలోని నీళ్లు పోసి ఒళ్లంతా రుద్ది స్నానం చేయించినాడు.

ఇంట్లోకి వెళ్లి అక్క పాత రంగుపూసల దండని తెచ్చి మేకపోతు మెడలో వేసినాడు. దాని ముఖం కళకళలాడింది. చాన్నాళ్లుగా అక్క వాడకుండా నల్లడబ్బాలో పెట్టి ఉన్న పాతగజ్జెలను తెచ్చి దాని కాళ్లకు చుట్టినాడు.

అది అడుగుతీసి అడుగు వేసినప్పుడల్లా వచ్చే 'ఘల్ ఘల్' శబ్దాలు విని మురిసినాడు.

ఇంతలో నాయన సిద్దులయ్య వచ్చినాడు.

''ఒరేయ్.. గోవిందా! మనదేరా ఈ మేక! వెదురుకుప్పం సంతలో కొనుక్కొచ్చినానురా. భద్రంగా చూసుకో'' అని చెప్పి ఇంట్లోకి వెళ్లినాడు.

* * *

ఆ రోజు నుంచీ మేక.. గోవిందుడి నేస్తమయ్యింది.

సందు దొరికితే చాలు.. బీడు భూముల్లోకి, చెరువు కాడికి, కటవలోకి దాన్ని తోలుకెళ్లే వాడు. చింతచెట్ల లేత చిగుళ్లు కోసి దాని నోటికి అందించేవాడు. దానికి ఏవేవో కబుర్లు చెప్పేవాడు.

వాడి సావాసగాళ్లంతా..

''ఒరేయ్ గోవిందూ.. 'ముందు వచ్చిన చెవుల కంటే, వెనుక వచ్చిన కొమ్ములు వాడి' మాదిరి మమ్మల్ని మరచినావురా!''.. అని నిష్టూరం చేసినారు.

చీమిడి ముక్కులోడు గబగబా ముందుకొచ్చి..

''ఒరేయ్.. ఈ మేకని ముద్దుముద్దుగా చూసుకుంటా ఉండాడు గోవిందుడు. ఇంగ్లీషు కూడా నేర్పించ బోతాడేమో రోయ్! ఏదో సినిమాలో మాదిరి.. ఏప్రిల్ నెల తర్వాత 'మే' చెప్తుంది, జూన్ ముందు నెలడిగితే 'మే' అని చెబుతుందేమో ఈ మేక..'' అని చెప్పినాడు.




ఆర్.సి.కృష్ణస్వామి రాజు
93936 62821